స్కెచ్

# బతకడానికి బైరాగిచిట్కా

పి. రామకృష్ణరాజు

నేను ఏదైనా వ్రాద్దామనుకునేసరికి పళ్ళికిలించుకుంటూవచ్చి ఎదురుగా డ్రాయరుమీద కూచుంటాడు. నా ఎడంచేతిలోని కాగితం నా కుడిచేతిలోని కలం వాడికి పరమశత్రువులు. వాటిని కలవనివ్వకుండాచెయ్యడానికి వాడెన్నో ప్రయత్నాలు చేస్తుంటాడు. చివరికి వాడిదే గెలుపు.

గోల్డుఫ్లేకుసిగరెట్టుకేస్‌లోనుంచి చార్మినారు సిగరెట్టుతీసి వెలిగించాడు.

వాడిని నేను ఒప్పుకోను. అంతా డాబు. లౌక్యం. డబ్బుకోసం ఏదైనాచేస్తాడు. చెయ్యమంటాడుకూడా సిగ్గులేకుండా. నాకు నీతులు బోధించడానికి తయారయే ఆక్కర్లేని గురువు. నీవు వ్రాస్తున్న సాహిత్యం అడవినికాసిన వెన్నెలంటాడు. నూటికి తొంభైతొమ్మిదిమందికి అర్థం కాదంటాడు. అర్థం కాకపోతే నాకేం? మిగిలిన ఆ ఒక్కడికోసమే నే వ్రాస్తున్నాను. ప్రజలు మెచ్చిందే వ్రాయమంటాడు. అంటే వాడి ఉద్దేశ్యం డడడాపాటలు, రుచిలేని చచ్చుకథలు సినిమాతారల జీవిత చరిత్రలు వ్రాయమని. చూస్తూ ఎలా మోసంచెయ్యగలను?

"అదే నీజీవితాన్ని ధ్వంసంచేసింది. ఈ చదువులు అనవసరమని ఏదో వేదాంతంలోకి దిగి కాగితం కలం పుచ్చుకొని ఇంట్లో కూచున్నావ్. కూడులేక చస్తున్నా నీ అభిప్రాయాలు మార్చుకోనంటావ్. పస్తులున్నా సరే పట్టువిడవనంటావ్ కదూ? సరే, నీ ఉద్దేశ్యాల ప్రకారమే నడిచావనుకో, నీకొచ్చి ఒరిగిందేమిటి? నిన్ను దేశంలో అర్థంచేసుకున్న పదిమందో ఇరవైమందో "మహాకవి"అన్నారనుకో. కాని ఆమహాకవికి కూడుందో లేదో లోకానికవసరంలేదు. పోనీ, నువ్వు వ్రాసిన పుస్తకాలమ్ముకుని బ్రతుకుతానంటావా? నువ్వు తెలుగువాడివని జ్ఞాపకంవుంచుకో. నువ్వు పుస్తకాలెన్నమ్మినా నీకు ప్రెస్‌బిల్ తీరదు. తెలుగుదేశం నువ్వెంతమహాకవివయినా వందకాపీలకంటె ఎక్కువ కొనదని గ్యారంటీయిస్తున్నాడో అనుభవశాలి. పోనీ పత్రికలవాళ్ళు కిస్తానంటావ్. వాళ్లు నిన్ను చావనివ్వరు, బ్రతకనివ్వరు. ఆశమాత్రం మిగులుస్తారు. వాళ్ళకెప్పటికి ఆశకురుపులు వెయ్యాలని వాళ్ళనమ్మకం."

వాని లెక్చరు కర్ణకఠోరంగావుంది. జిగురులా పట్టుకున్నాడు నన్ను. ఏవోవంకలుపెట్టి నన్ను మార్చుదామని వాడిఉద్దేశ్యం! నేనేం రూపాయినోటునికాదు చిల్లరకోసం మార్చడానికి. వాడికి అలవాటే, మనుష్యుల్ని అవసరంకోసం రూపాయికాగితాల్లా మార్చుకుంటూండడం. పాపం! అమాయకుల్ని—

"నువ్వు గొప్పగొప్ప కవులు, చిత్రకారులు, గాయకులు అని చెబుతూంటావే వాళ్ళభార్యల్ని అడుగు నిజం తెలుస్తుంది. ఎందుకూ-లాల్చీ తీసి చూడు. మాసిపోయిన బనీను కనిపిస్తుంది. ఆ బనీనుకూడా తియ్యకు ఇక నీవు చూడలేవు."

వాడు చెబుతున్న విషయం నిజమే కాని నేను నా ఆశయాలకోసం నాజీవితాన్నర్పిస్తాను. నేను ఏమైనాసరే వాటినిమాత్రం విడువను, నా కంఠంలో ప్రాణం వున్నంతవరకూ. మళ్ళీ ఏదో మొదలు పెడుతున్నాడు.

"నువ్వు నీకోసం ఎంతమందిని బలి చేస్తున్నావో తెలుసా? కాటికికాళ్లు చాపిన నీతల్లిని, ఎప్పుడూ కడుపునిండా కూడుతిని ఎరుగని నీ భార్యని, మందూమాకూలేక రోగాలతో బాధపడుతూ కుక్కిమంచంలో పడుకుని వున్న నీ ముగ్గురి పసిబిడ్డలని. విచారించకు. నీ పసిబిడ్డల్ని చూస్తున్న నీకు గుండెలున్నాయా? అని నా అనుమానం. అన్నీ తలచుకుంటే గుండె తరుక్కుపోతోంది. వాళ్ళని ఏవో చెయ్యాలని ఆశించావు. ఏడుస్తున్నావా శుంఠ్రాడిలా. ఏడవకు ఏడిస్తే ఏం లాభం? ఇప్పుడైనా నే చెప్పినట్టు చెయ్యి. సమయం మించిపోలేదు. ఆ చెంగయ్యనుగురించి, వూళ్ళో వాళ్ళనుగురించి పత్రికలనిండా నిజం

ప్రాణాపు. అందుకే చెంగయ్యకి కోపం. నిన్ను లొంగదీసుకోవాలని పూరివాళ్ళ ప్రయత్నం. సమయం దాటబెట్టుకోకు, త్వరగా చొక్కా లేకపోయినా నా జరీకండువా వేసుకెళ్లు. జంధ్యం మరచిపోకు, చెంగయ్య లక్షరూపాయలు కట్నమిచ్చి కూతురికి పెళ్ళి చేస్తున్నాడు. "పంచ రత్నాలు" వ్రాసుకెళ్ళి నమస్కారంచేస్తే వెయ్యి నూటపదహార్లు చేతిలో పెడతాడు. నీ పసిపిల్లల కోసమైనా నీ వేదాంతం విడచిపెట్టు, త్వరగా బయలుదేరు" అన్నాడు.

నా జీవితంలో వాడిని మరువలేను. నా ముద్దు పాపాయిలు నాకు దక్కేటట్లు, లోకంలో దిక్కులేనివాడిగా చావకుండా నాలుగురాళ్ళు సంపాదించుకుని లోకంలో నూటికి తొంభై తొమ్మిదిమందిచేత "మహానుభావుడు" అనిపించుకునేటట్లు నన్ను తయారుచేశాడు.

నేనిప్పుడు అందరికీ అవసరం. చెంగయ్యగారి సినీమాకంపెనీలో కవిని. కాబోయే డైరక్టర్ని. ఒక్క అరకప్పు టీ ఇస్తానంటే నా ఇంటర్వ్యూ లభిస్తుంది. కొంచెం వక్కపొడి పెట్టి, ఒక గోల్డు ఫ్లేక్ సిగరెట్టు యిచ్చి నా నమస్కారములు అందుకోండి.

స్కెచ్

# మా గురుదేవులు

"కృష్ణానంద్"

"నీవే తల్లివి దండ్రివి..." అన్నట్లు మా ఆచార్యులవారే మాకు.సమస్తమూను! మా ఆచార్యులు అంటే, ఏమని చెప్పాలి?—మా ఆచార్యులు. ఆచార్యులవారనే అంటూంటారు. ఆయన మా గురుదేవులు; ఆశ్రమ రాజ్యాధిపతులు! "గురు పాఠీనమవయి జలగ్రహాంబవయి క్రోడంబవయి..." శ్రీ మహావిష్ణువువలె మా గురుదేవులుకూడా అనేక జన్మల్లో అనేక ఘనకార్యములు చేసియున్నారు. విష్ణువు అవతరించినప్పుడెల్లవారికీ ప్రతికక్షులుగా తమ అంశల్లోంచి రావణ కుంభకర్ణ శిశుపాల దంతవక్త్రాది రాక్షసుల్ని సృజించి పోటీగా నిలబెట్టిన ధీశాలురు. పూర్వ పురాణయుగాల్లో కొందరికి తమ అంశ వున్నట్టు మొన్న సమాధిలోంచి లేచినప్పుడు చెప్పినట్లు జ్ఞాపకం! రాక్షస గురువైన శుక్రాచార్యులు మా ఆచార్యులవారి మేధస్సులోని కుళ్ళిపోయిన భాగంలోంచి ఉద్భవించాడని వారే సెలవిచ్చారు. మేము (శిష్యులం) నమ్మక తప్పదు. ఆయన చెప్పిన "వేదాశరాలన్నీ" నమ్మేరకం మేము. భారత యుద్ధకాలంలోని "మామ శకుని" గూడా వీరి జటాజూటంలోంచి ఒకానొక సమయంలో వూడి పడ్డాడని ఒక సందర్భంలో, జలకమాడిన పిదప పిలక ముడివేసుకొంటూ, అన్నారు మా గురువర్యులు. మా ఆచార్యులవారి శిఖాగ్ర పుంసత్వానికి మాఒళ్ళు పులకరించింది. పంచతంత్రంలో పంచాననాన్ని సైతం పల్టీకొట్టించి కుయుక్తులతో కుతంత్రాలతో, లోపల కుళ్ళు పైకి దరహాస వదనంతో కథ నాక్రమించే దమనకుండు మావారి అర్థాంశ! మంత్రి యుగంధరుడు మాగురుశేఖరులు తుమ్మినపుడు నాశికారంధ్రాల్లోంచి బహిర్గతమైనట్లు ప్రజలు చెప్పుకొంటుంటే విన్నాం. చాణక్యుడుకూడా మా ఆచార్యులవారి కణతలు ద్వారబంధంతగిలి చిట్లినప్పుడు కారిన రక్తంలోంచి జనించాడని చూసినవాళ్లు (అప్పుడు) రాసేరు. మహాజ్ఞాని అయిన పిచ్చి తుగ్లక్ మావారి పూర్ణాంశ!, ఔరంగజేబు, గజినీ, ఘోరీ ఇత్యాదులు,మాయ,కుళ్ళు,స్వార్థం అసూయలతో నిండివున్న ఈ ప్రపంచంలో వుండుటవలన కళంకితమైన మా గురుదేవులశరీరమునుండి ప్రవహించు చెమటనుండివచ్చినవారు. ఒక్క మాదేశంలోనే కాకుండా విదేశాల్లోకూడా తాము అవతారాలనుఎత్తినట్లు వారు సెలవిస్తుంటారు. షేక్స్పియర్ డ్రామాల్లోని విలన్లంతా వీరి కోపతాప పాప బడబాగ్నుల్లోంచి లేచి వచ్చినవారు. దుర్వాస విశ్వామిత్రాది "సూరాకారపు" మహర్షులంతా మావారి సహాధ్యాయులట! ఇదంతా మా ఆచార్య గురువర్యులు వివరించిన పూర్వజన్మ